
andhrajyothy.com శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 28.8 కనిష్ఠం 12.2

ఆంధ్రజ్యోతి

ఆదిలాబాద్ జిల్లా వార్తలు

5 శనివారం 23 నవంబరు 2024





వచ్చీరాని.. వైద్యం!

- తెలిసీ తెలియని వైద్యంతో రెచ్చిపోతున్న డాక్టర్లు
- శస్త్రచికిత్సలకు సైతం వెనకాడని కంపౌండర్లు
- జిల్లాలో ఫేక్ పట్టాలతో వైద్యం పేరిట దోపిడీ దందా
- కరువవుతున్న వైద్య ఆరోగ్య శాఖ పర్యవేక్షణ

జిల్లాలో వైద్యం పేరిట కొందరు రెచ్చిపోతున్నారు. మారుమూల గ్రామాల ప్రజలే లక్ష్యంగా కొందరు వైద్యులు, ఆర్ఎంపీలు దోపిడీ పర్వానికి తెర లేపుతున్నారు. ఎంబీబీఎస్ వైద్యులు శస్త్ర చికిత్సలు చేస్తున్నారు. ప్రభుత్వ వైద్యులు కొందరు సొంతంగా నిర్వహిస్తున్న ప్రైవేట్ ఆసుపత్రులకు రోగులను రెఫర్ చేస్తున్నారు. జిల్లాలో ఇంత జరుగుతున్నా.. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు మాత్రం చోద్యం చూస్తుండడం పలు అనుమానాలకు తావిస్తోంది.

ఆదిలాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొందరు వైద్యుల పేరిట దోపిడీ దందాకు తెర లేపుతున్నారు. ఎలాంటి అనుభవం, వైద్య పరిజ్ఞానం లేకున్నా శస్త్ర చికిత్సలు చేసేందుకు సైతం కొందరు ఓటీటీ, ఆర్ఎంపీ, కంపౌండర్లు ముందుకు వస్తున్నట్లు సమాచారం. పేరుకు వైద్యులు ఉన్నా.. అంతా కింది స్థాయి సిబ్బందే తతంగాన్ని నడుపుతున్నట్లు కనిపిస్తోంది. మరికొందరు విదేశీ నకిలీ వైద్య పట్టాలతో ఎంబీబీఎస్, ఎంఎస్, ఎండీ, ఆర్థో పేరిట వైద్యం చేస్తున్నారు. ఏదైనా ఫిర్యాదు వస్తేనే అధికారులు హడావిడి చేస్తూ ఆసుపత్రులను తనిఖీ చేస్తున్నారు. ఆ తర్వాత అంతా మామూలుగానే మారుతోంది. అధికారులు కఠినంగా వ్యవహరించక పోవడంతోనే నకిలీ వైద్యులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. అలాగే అర్హత కలిగిన వైదుల పేరిట ఆసుపత్రుల అనుమతులు తీసుకుంటూ అనర్హులు వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలుస్తోంది. ఎంతో కొంత ఆర్థిక పలుకుబడి ఉంటే చాలు నర్సింగ్‌హోమ్, సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిని ఏర్పాటు చేయడం పరిపాటిగానే మారింది. గ్రామీణ ప్రాంతాల్లో పని చేస్తున్న ఆర్ఎంపీలను అడ్డుపెట్టుకుని అడ్డగోలు వైద్యానికి ఎగబడుతునట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. అయితే రోగం సంగతి దేవుడెరుగు కానీ కమీషన్‌లతోనే కొందరు నకిలీ వైద్యులు జేబులు నింపుకోవడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

అడ్డగోలుగా ఆపరేషన్లు

కొందరు వైద్యులు అడ్డగోలుగా ఆపరేషన్లను చేస్తూ అందినకాడికి దండుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ముఖ్యంగా ఆర్థో ఆసుపత్రుల పేరిట బోర్డులను ఏర్పాటు చేస్తూ ఎంబీబీఎస్ వైద్యులే శస్త్ర చికిత్సలు చేస్తున్నట్లు వినిపిస్తోంది. జిల్లా కేంద్రంలో ఒకరిద్దరు ప్రముఖ వైద్యులు చదివింది ఎంబీబీఎస్సే అయినా.. ఆర్థో శస్త్ర చికిత్సలు చేయడంలో ఆరితేరినట్లు చెబుతున్నారు. అసలు నిబంధనల ప్రకారం ఎంబీబీఎస్ డాక్టర్లు సాధారణ వైద్యంతో పాటు గాయాలకు కట్టు కట్టడం, శుభ్రం చేయడం లాంటి వైద్యాన్ని మాత్రమే చేయాల్సి ఉంటుంది. కానీ ఏకంగా ఆర్థో డాక్టర్లమంటూ శస్త్ర చికిత్సలు చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఎంఎస్ ఆర్థో పూర్తి చేసిన వారే శస్త్ర చికిత్సలు చేయాల్సి ఉంటుంది. కానీ ఏదైనా ప్రమాదం జరిగిన అత్యవసర పరిస్థితులో ఎంబీబీఎస్ డాక్టర్లే ఆర్థోలుగా అవతారమెత్తుతున్నారు. వచ్చీరాని వైద్యం వికటించడంతో కొన్ని సందర్భాల్లో రోగులు శాశ్వత అంగవైకల్యం కలిగి మంచం పడుతున్నారు. ఇదేమిటని ప్రశ్నించే ప్రయత్నం చేస్తే పొంతన లేని సమాధానం చెబుతూ తప్పించుకుంటున్నారనే విమర్శలు వస్తున్నాయి.

సొంత ఆసుపత్రులకు రెఫర్..

కొందరు ప్రభుత్వ వైద్యులు సొంతంగా నడుపుతున్న ప్రైవేట్ ఆసుపత్రులకు రోగులను రెఫర్ చేస్తున్నారు. జిల్లా కేంద్రంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో అన్ని రకాల వైద్య సౌకర్యాలు అందుబాటులో ఉన్నా అర్హులైన వైద్యులు లేరన్న కారణంగా మెరుగైన వైద్యం కోసం సొంత ఆసుపత్రులకు రెఫర్ చేస్తున్నట్లు రోగులు ఆరోపిస్తున్నారు. గతంలో నకిలీ వైద్యులపై చర్యలు తీసుకోవాలని క్వాలిఫైడ్ డాక్టర్‌లు సైతం డిమాండ్ చేసిన సందర్భాలు ఉన్నాయి. కానీ చర్యలు తీసుకోవడంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు విఫలమవుతున్నారన్న విమర్శలే వస్తున్నాయి. వైద్యం కోసం ఆసుపత్రులకు వచ్చిన బాధితులను మెరుగైన వైద్యం పేరిట పొరుగు జిల్లాలైన కరీంనగర్, నిజామాబాద్, హైదరాబాద్ లాంటి పట్టణ ప్రాంతాల్లో ఉన్న కార్పొరేట్ ఆసుపత్రులకు తరలిస్తూ భారీగా కమీషన్లు దండుకుంటున్నారు. అసలు నయంకాని మొండి వ్యాధులకు సైతం చికిత్సలు ఉన్నాయంటూ నమ్మబలుకుతున్నారు. అలాగే పొరుగున్న ఉన్న మహారాష్ట్రలోని యవత్‌మాల్, నాగ్‌పూర్ ప్రాంతాలకు సైతం రోగులను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఆధునిక చికిత్సలు ఉన్నా.. కాలయాపన చేస్తూ ప్రైవేట్ ఆసుపత్రులకు రోగులు వచ్చే విధంగా ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో సామాన్య, మధ్య తరగతి రోగులు ఆర్థికంగా నష్టపోతున్నారు. దీనిపై జిల్లా అధికారులకు రోగుల కుటుంబీకులు పలుమార్లు ఫిర్యాదులు చేసినా ఫలితం మాత్రం శూన్యమే..

తనిఖీలు చేపడుతున్నాం

- నరేందర్ రాథోడ్ (డీఎంఅండ్‌హెచ్ఓ)

జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రుల్లో నిరంతరంగా తనిఖీలు చేపడుతున్నాం. గత రెండు మాసాల క్రితమే 8 టీములు జిల్లా వ్యాప్తంగా ఆసుపత్రులను తనిఖీలు చేశాయి. ఇందులో కొన్ని ఆసుపత్రుల్లో లోపాలు బయట పడ్డాయి. ఇప్పటికే సంబంధిత ఆసుపత్రులకు నోటీసులు ఇవ్వడం జరిగింది. ఏమైనా ఫిర్యాదులు వస్తే పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

అండర్ బ్రిడ్జి నిర్మాణానికి సహకరించాలి

- ఎంపీని కలిసిన పొన్నారి రైతులు



వినతిపత్రం సమర్పిస్తున్న పొన్నారి గ్రామ రైతులు

తాంసి రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామ సమీపంలో రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణానికి సహకరించాలని పొన్నారి గ్రామ రైతులు శుక్రవారం ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యుడు జి.నగేష్‌కి వినతిపత్రాన్ని సమర్పించారు. తమకు తమ పంట పొలాలకు వెళ్లడానికి నిత్యం ఇబ్బందులు తలెత్తుతుఆన్నయని విన్నవించా రు. ప్రస్తుతం ఉన్న ఓపెన్ ద్వారాన్ని మూసివేస్తున్నారని దీని వల్ల తమకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతాయని తెలిపారు. పాత ద్వారాన్ని మూసి వేయకుండా అలాగే ఉంచేలా చర్యలు తీసు కోవాలి ఎంపీకి విన్నవించారు. ఈ విషయాఇకి వెంటనే స్పందిం చిన ఎంపీ నగేష్ త్వరలోనే రైల్వే మంత్రితో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామి భరోసా కల్పించారు. ఎంపీని కలిసిన వారిలో మాజీ ఎంపీటీసీ రేఖ రఘు, మాజీ సర్పంచ్ అశోక్, రైతులు నవీన్‌రెడ్డి,రాజ్‌కిర్‌రెడ్డి, తిరుపతి, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

ప్రజాభిమానంతోనే సేవచేసే భాగ్యం : ఎమ్మెల్యే



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న హాస్టల్ సిబ్బంది

ఆదిలాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ ప్రజల అభిమానంతోనే సేవచేసే భాగ్యం కలిగిందని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. వసతి గృహాల్లో విద్యార్థులు పడే ఇబ్బందులను చూసి శాసనసభలో ప్రతిపక్ష నాయకునిగా మాట్లాడే అవకాశం రావడంతో హాస్టల్ విద్యార్థుల కష్టాలను మెస్‌చార్జీల విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. దీనికి సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి బీసీ శాఖ మంత్రి కమిటీలు చర్చించి మెస్ చార్జీల పెంపుకు ఆమోదం తెలపడంతో రాష్ట్ర మొత్తంలో వసతి గృహాల్లో ఉండే 8 లక్షల మంది విద్యార్థులకు మేలు జరిగిందన్నారు. రాబోయే రోజుల్లో ప్రజా సమస్యలను ప్రతిపక్ష నాయకుడిగా శాసన సభ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేలా కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో హాస్టల్ సిబ్బంది, బీజేపీ నాయకులు అశోక్ ఒడ్డి, ముకుంద్, దయాకర్ పాల్గొన్నారు.

వృత్తినైపుణ్య శిక్షణను వినియోగించుకోవాలి

- జిల్లా కలెక్టర్ రాజార్షిషా



అభ్యర్థులకు సర్టిఫికెట్లను అందిస్తున్న జిల్లా కలెక్టర్

ఆదిలాబాద్, నవంబరు 22 (ఆంధ్ర జ్యోతి) :నిరుద్యోగులు వృత్తినైపున్య శిక్షణలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజార్షిషా సూచించారు. వైటీసీ కేంద్రంలో శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు శుక్రవారం సర్టిఫికేట్లను పంపిణీ చేశారు. దీనికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ఆయా విభాగాలలో శిక్షణ పొందిన మహిళలు, అభ్యర్థులతో మాట్లాడి శిక్షణ గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారికి సర్టిఫికేట్లను అందించి స్వయం ఉపాధిలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజార్షి షా మాట్లాడుతూ మహిళలతో పాటు నిరుద్యోగులు స్వయం ఉపాధిలో రాణించేలా ప్రభుత్వ పరంగా వృత్తి నైపుణ్య శిక్షణలను అందిస్తున్నామన్నారు. టైలరింగ్‌లో శిక్షణ పూర్తి చేసిన మహిళలు డ్వాక్రా గ్రూపుల్లో చేరితే వారికి వడ్డీలేని రుణాలతో వ్యాపారాలను ప్రారంభించవచ్చని తెలిపారు. అదేవిధంగా ఏసీ, ఫ్రిడ్జ్ మెకానిక్‌లు కూడా వేరువేరుగా కాకుండా ముగ్గురు నలుగురు ఒక యూనిట్‌గా ఏర్పడి వ్యాపారాన్ని ప్రారంభించాలన్నారు. దానికోసం కూడా రుణాలను అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీవైఎస్ఓ వెంకటేశ్వర్లు, డీడబ్ల్యుఓ సబిత, వైటీసీ కేంద్రం నిర్వాహకులు, అభ్యర్థులు పాల్గొన్నారు.

మారుమూల గ్రామాల అభివృద్ధికి కృషి : ఎంపీ నగేష్



పనులు ప్రారంభిస్తున్న ఎంపీ నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్ రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మారుమూల గ్రామాల్లో కనీస సౌకర్యాలతోపాటు విద్య, వైద్య, ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకపథకాన్ని అమలు చేస్తుందని ఎంపీ గొడం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని దివ్యగూడ, పోతుగూడ గ్రామాల్లో పర్యటించారు. అనంతరం మల్టీ పర్పస్ కమ్యూనిటీ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివాసుల్లో వెనుక బడిన జాతులు కోలం, తోటి కులాలకు ఆర్థికంగా బలోపేతం చేసేందుకు రూ.87 వేల కోట్లు మంజూరు చేసిందన్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మహిళలకు తులం బంగారం ఎప్పుడిస్తారు ?

- మాజీ మంత్రి జోగురామన్న



మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగురామన్న

ఆదిలాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహిళలకు ఇచ్చిన తులంబంగారం హామీని ఎప్పుడు నెరవేరుస్తారోకాంగ్రెస్ నేతలు చెప్పాలంటూ మాజీ మంత్రి జోగురామన్న డిమాండ్ చేశారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అబద్దాలకు చక్రవర్తిగా మారాడని విమర్శించారు. ఇప్పటి వరకు ఎంత మంది మహిళలను కోటీశ్వరులు చేశారో ముఖ్యమంత్రి చెప్పాలని డిమాండ్ చేశారు. బూతులు, అబద్దాలు మాట్లాడడంలో ముఖ్యమంత్రి నెంబర్ 1గా మారాడని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో మహిళల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని కళ్యాణలక్ష్మి, షాధిముబారక్ పథకాలను అమలు చేయడం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఉన్న పథకాలను నిలిపి వేసే ప్రయత్నం జరుగుతుందన్నారు. కేసీఆర్ కిట్, న్యూట్రిషియన్ కిట్ పతకాలను ప్రభుత్వం ఎత్తివేసిందన్నారు. మహిళ ఆడపడుచులకు బతుకమ్మ చీరలను కూడా ఇవ్వకుండా ప్రభు త్వం మోసం చేసిందన్నారు. గ్యాస‌సబ్సిడీ, రైతుబంధు, మహాలక్ష్మి పేరిటా ప్రతి మహిళకు రూ.2500లు నగదు ఇస్తామని ప్రభుత్వం మొండి చేయి చూపిందన్నారు. కలుషీత ఆహారం తిని ఎందరో మంది విద్యార్థులు ప్రాణాలు పోగొట్టుకుంటున్న ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. అబద్దాలతో ప్రజలను మోసం చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పై కేసు నమోదు చేయాలని జిల్లా ఎస్పీకి ఫిర్యాదుచేసిన కేసు నమోదు చేయడం లేదన్నారు. త్వరలోనే ప్రైవేట్‌గా కేసులు వేస్తామని పేర్కొన్నారు. ఇందులో మాజీ కౌన్సిలర్లు ప్రకాష్, పండ్ల శ్రీను, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రహ్లాద్ పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం : బోథ్ ఎమ్మెల్యే



బీటీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

తలమడుగు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్దే ధ్యేయమని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని పల్లి(బీ), అర్లి (కే) గ్రామాలకు మంజూరైన రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బోథ్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి రోడ్లను నిర్మించేందుకు చర్యలు చేపడతామని అన్నారు. అనంతరం రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వ హయాంలో రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయన్నారు. మెయిన్ రోడ్డు నుంచి పల్లి(బి) గ్రామం వరకు రూ.2.33 కోట్లు, ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి పల్లి(కే) వరకు రూ.2.33 కోట్లు, బరంపూర్ నుంచి అర్లి(కే)గ్రామం వరకు రూ.2 కోట్లతో బీటీ రోడ్ల నిర్మాణం కోసం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపిశాలువాతో సన్మానించారు. గిరిజన గ్రామాలకు కూడా చక్కటి రోడ్ల సౌకర్యం కల్పించాలన్న గత ప్రభుత్వ ఆలోచనలతో ఈ రోడ్లకు నిధులు మంజూరు చేశారని అన్నారు. ఎన్నో ఏళ్ళ కలగా మిగిలిన రోడ్లకు బీఆర్ఎస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. మీ మంచి కోరే వ్యక్తిగా ఎల్లప్పుడూ మీ కష్టసుఖాల్లో భాగమవుతానని అన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ తోట వెంకటేష్, బి.ఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు కేంద్రేశ్వర్‌రెడ్డి, పిడుగు అభిరామ్‌రెడ్డి, రమాకాంత్, సురేందర్‌రెడ్డి, గజానంద్, పీఎస్‌పీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, గంగాధర్, నారాయణ, తిరుమల గౌడ్, రవికాంత్ యాదవ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతులుగా ఉండాలి



మార్నింగ్ వాక్‌లో పాల్గొన్న మండల ప్రముఖులు

ఇంద్రవెల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ ఆరోగ్యవంతులుగా ఉండాలని, అందుకు నిత్యం వ్యాయామం, నడక ఎంతో ఉపకరిస్తుందని మండల అటవీ శాఖ ఎఫ్ఆర్‌వో సంతోష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని అనునిత్యం జరిగే మార్నింగ్ వాక్ కార్యక్రమంలో భాగంగా మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ డోంగ్రే మారుతి పటేల్‌తో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. నిత్యం నడకతో మానసిక ఉల్లాసాన్ని పెంచుకోవడంతో పాటు ఆరోగ్యాలను పరిరక్షించుకున్న వారు అవుతారని ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యాలను కాపాడుకునేందుకు నిత్యం వ్యాయామాలు, నడక సాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, సామాజిక కార్యకర్త రాథోడ్ అనిల్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు సోన్ కాంబ్లే జితేందర్, మండల నాయకులు సోమోరే నాగోరావు, బీజేపీ నాయకులు మోరే దిలీప్, మాస్కే రాజవర్ధన్, ఎం.డి. జునైద్, సోన్ కాంబ్లే సూరజ్, సంజీవ్ పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో ఆకస్మిక తనిఖీ



ఝరి ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జీ డీడీ వసంత్‌రావ్

ఉట్నూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ ఉన్నత పాఠ శాలలో పదోతరగతి ఫలితాలు ముఖ్యంగా ఉపాధ్యాయులు పనిచేయాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఇన్‌చార్జీ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ వసంతరావు ఆదేశించారు. వారం రోజులుగా జిల్లాలోని నార్నూర్, గాదిగూడ, ఉట్నూర్, ఇంద్రవెల్లి, నేరడిగొండ మండలాల్లో ఉన్న గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ ఉన్నత పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పదోతరగతి ఫలితాలు వంద శాతం రావాలని ఈ మేరకు ప్రతి ఉపాధ్యాయుడు ప్రాథమిక బద్ధంగా విద్యార్థు లకు చదువు చెప్పాలని సూచించారు. అయా పాఠశాలలో ఉన్న సబ్జెక్టు టీచర్లు, సీఆర్టీ లు తమ సబ్జెక్టులలో మంచి మార్కులు రానట్లయితే వారిపై శాఖాపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆశ్రమ పాఠశాలల వార్డెన్లు, డిప్యూటీ వార్డెన్లు విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని, మెనూలో ఎలాంటి లోటుపాట్లు ఉన్న చర్యలు ఉంటాయని హెచ్చరిస్తుండడంతో సిబ్బంది విధులకు సక్రమంగా హాజరవు తున్నట్లు తెలుస్తుంది.

మారణాయుధాలు తరలిస్తున్న ముఠా అరెస్టు

- వివరాలు వెల్లడించిన ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం



సమావేశంలో మాట్లాడుతున్న ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం

- నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- అక్రమంగా తరలిస్తున్న నాలుగు పిస్టల్స్ స్వాధీనం
- బీహార్ రాష్ట్రం మ్యుంగార్ రైల్వేస్టేషన్‌లో ఫిస్టల్స్ కొనుగోలు
- ఉమ్మడి కర్నూల్ జిల్లాలో జనశక్తి పార్టీ పునర్నిర్మాణానికి ప్లాన్

ఆదిలాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాది రాష్ట్రాల నుంచి మారణాయుధాలను తరలిస్తున్న ముఠా సభ్యులను ఆదిలాబాద్ జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. గురువారం రాత్రి పక్కా సమాచారంతో ఆదిలాబాద్ జిల్లా చాందా(టీ) బైపాస్ రోడ్డు వద్ద పోలీసులు నిందితులను అరెస్టు చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఎస్పీ కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నంద్యాల జిల్లా సున్నిపేట గ్రామానికి చెందిన ఓట్టి వెంకట్‌రెడ్డి గతంలో జనశక్తిలో పని చేశాడు. సూర్యాపేట జిల్లాలో గతంలో జరిగిన తన మిత్రుడి హత్యలో ప్రత్యర్థులపై ప్రతీకారం తీర్చుకునేందుకు, అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఉమ్మడి కర్నూలు జిల్లాలో జనశక్తి పార్టీని తిరిగి పునర్నించేందుకు మారణాయుధాలను కొనుగోలు చేసేందుకు సిద్ధమయ్యాడు. ఇందుకు గాను నల్గొండ జిల్లా నకిరేకల్ గ్రామానికి చెందిన వ్యాపారి నల్లగంటి ప్రసన్నరాజు (ఏ-4)అనే వ్యక్తిని సంప్రదించి.. ఆర్థిక సహాయం చేయాలని కోరగా.. అతను చేశాడు. దీంతో వెంకట్‌రెడ్డి (ఏ-1), ఆవులపాటి హేమాకాంత్‌రెడ్డి (ఏ-3) ఇద్దరూ కలిసి సున్నిపేట గ్రామానికి చెందిన షైల దిలీప్ (ఏ-2), అతని రెస్టారెంట్‌లో పనిచేసే బీహార్ రాష్ట్రానికి చెందిన భైరవ్‌తో కలిసి ఇటీవల కాశీకి వెళ్లారు. ఆ తర్వాత భైరవ్ బీహార్ రాష్ట్రంలోని మ్యుంగార్ రైల్వేస్టేషన్‌కు వెళ్లి పిస్టల్స్ బుల్లెట్లను కొనుగోలు చేసి తిరిగి వస్తుండగా.. గురువారం రాత్రి ఆదిలాబాద్ జిల్లా చాందా(టీ) బైపాస్ రోడ్డు వద్ద పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో పట్టుబడ్డారు. ఈ తనిఖీల్లో దిలీప్, హేమాకాంత్‌రెడ్డిలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అలాగే నాలుగు 7.65 ఎంఎం పిస్టల్స్, 8 మ్యాగజైన్‌లు, 18 లైవ్ రౌండ్‌లు, వారు ప్రయాణించిన కారును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మొత్తం 9 మందిపై కేసు దర్యాప్తు చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు వెంకట్‌రెడ్డి, అలాగే మారణాయుధాలను కొనుగోలు చేసేందుకు ఆర్థిక సహాయం చేసిన నల్లగంటి ప్రసన్న రాజులను శుక్రవారం హైదరాబాద్‌లో అరెస్టు చేసినట్లు ఎస్పీ వివరించారు. ఇప్పటికే ఏ-1 వెంకట్‌రెడ్డిపై మూడు హత్య కేసులు, హత్యాయత్నం కేసు, నాలుగు జనశక్తికి సంబంధించిన కేసులు, రెండు టాడా కేసులు.. ఇలా మొత్తం 10 కేసులలో వెంకట్‌రెడ్డికి సంబంధం ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. అదే విధంగా మిగిలిన ఐదుగురు నిందితులను అరెస్టు చేయడానికి ఆంధ్రప్రదేశ్, బీహార్, తెలంగాణ రాష్ట్రాలకు ప్రత్యేక పోలీసు బృందాలను పంపడం జరిగిందన్నారు. ఈ కేసులో నిందితులను పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించిన ఆదిలాబాద్ జిల్లా అదనపు ఎస్పీ బి.సురేందర్‌రావు, డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డిని ఎస్పీ అభినందించారు.

టీపీసీసీ విస్తృతస్థాయి
సమావేశంలో పాల్గొన్న బోరంచు శ్రీకాంత్‌రెడ్డి

మావల రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో నిర్వహించారు. టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, తుమ్మల నాగేశ్వర్ రావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో పాటు కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన పలువురు కాంగ్రెస్ నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తి కావస్తున్న సందర్భంగా ప్రజా పాలన విజయోత్సవాల సంబరాలు రాష్ట్ర ప్రభుత్వం చారిత్రాత్మకంగా చేపట్టిన కులగణన, రాబోయే స్థానిక సంస్థలు, ఎన్నికలు ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలపై ఈ సమావేశంలో చర్చ జరిగినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ప్రజా పాలన - ప్రజా విజయోత్సవ కార్యక్రమాలను కాంగ్రెస్ పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు గ్రామ గ్రామానికి వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు.

ఆర్మీకి ఎంపికైన యువతికి సన్మానం

ఇంద్రవెల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోనరి సట్వాజీగూడ గ్రామానికి చెందిన కేంద్రే నిఖిత ఇండియన్ ఆర్మీలో ఎస్ఎస్‌టీ టెక్ ఉద్యోగానికి ఎంపిక కావడంతో సట్వాజీ ఫడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం యువతికి శాలువాతో సన్మానించి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా పట్వాజీ ఫడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఫడ్ వరుణ్ పటేల్ మాట్లాడుతూ గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన యువతి ఇండియన్ ఆర్మీలో ఉద్యోగానికి ఎంపిక కావడం హర్షనీయమన్నారు. యువకులు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ లక్ష్య సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పటేల్ ఫడ్ చంద్రకాంత్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ఎం.డి.మసూద్, మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, పట్టణ అధ్యక్షులు ఎం.డి.జహీర్, చోటే అరవింద్, చోలే సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించండి

కుభీర్, నవంబరు(ఆంధ్రజ్యోతి) 22 : పరిసరాల పరిశుభ్రత పాటించాలని డీఎల్‌పీవో సుదర్శన్ అన్నారు. శుక్రవారం గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా మరుగుదొడ్లు , పరిసరాలను పరిశీలించి పారిశుద్ధ్యం పాటించాలని నిర్వాహకులకు సూచించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాలను అందించి , చదువులో వెనుకబడ్డ విద్యార్థులపై దృష్టి సారించి ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులకు పలు ప్రశ్నలను వేసి సమాధానాలు రాబట్టారు. అనంతరం మండల కేంద్రంలోని పలు కాలనీలను పరిశీలించి మురికి కాలువలను వారానికోసారి శుభ్ర పరిచి దోమలు, ఈగలు వ్యాప్తి చెందకుండా చూడాలని అన్నారు. గ్రామస్తులకు పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజేశ్వర్, ఆశ్రం పాఠశాల ఉపాధ్యాయులు చిన్నన్న, సీఆర్‌టీలు తదితరులున్నారు.

బేకరీషాపుల్లో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు

- నిబంధనలు ఉల్లంఘించిన షాపునకు నోటీసులు



బెకరీషాపులో తనిఖీలు చేపడుతున్న ఫుడ్ ఇన్స్‌పెక్టర్ ప్రత్యూష

భైంసా, నవంబరు 22 : పట్టణ పరిధిలో పలు బెకరీ షాపుల్లో శుక్రవారం జిల్లా ఫుడ్ ఇన్స్‌పెక్టర్ ప్రత్యూష నేతృత్వంలోని అధికారుల బృందం తనిఖీలు చేపట్టింది. మధ్యాహ్నం వేళ నుంచి సాయంత్రం వేళ వరకు తనిఖీలు కొనసాగాయి. ఇందులో వ్యవసాయ శాఖ కార్యాలయ సమీపంలోని ఒక బేకరీ షాపులో నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తున్న బ్రెడ్ ప్యాకెట్లను గుర్తించిన ఫుడ్ ఇన్స్‌పెక్టర్ సంబంధిత బెకరీ షాపు యజమానికి నోటీసులు జారీ చేసినట్లుగా తెలిసింది.బ్రెడ్ ప్యాకెట్లపై తయారీ సంస్థ వివరాలు తెలిపే ఎలాంటి లెబుల్స్ లేకుండా విక్రయిస్తుండటం పట్ల ఫుడ్ ఇన్స్‌పెక్టర్ బృందం అభ్యంతరం తెలిపినట్లుగా సమాచారం. సంబంధిత బ్రెడ్ ప్యాకెట్ల తయారీ సంస్థ వివరాలు తెలుసుకునేందుకు అధికారుల బృందం యత్నించినప్పటికి సదరు బెకరీ షాపు యజమాని ఎలాంటి వివరాలు అందివ్వలేదని తెలిసింది.

ఇచ్చిన హామీలు నెరవేర్చకుంటే నిరవధిక సమ్మె

- అధికారులకు సమ్మె నోటీస్ అందజేసిన సమగ్ర శిక్ష ఉద్యోగులు



డీఈఓకు సమ్మె నోటీస్ ఇస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

దిలావర్‌పూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే నిరవధిక సమ్మెకు దిగుతామని సమగ్ర శిక్ష ఉద్యోగులు హెచ్చరించారు. ఈ మేరకు నిర్మల్ జిల్లా కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, జిల్లా విద్యాధికారికి సమ్మె నోటీస్ అందజేశారు. గత సంవత్సరం అప్పటి టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్న ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చాలని వారు డిమాండ్ చేశారు. 15 రోజులలోగా ప్రభుత్వం చర్చలకు పిలిచి హామీలు నెరవేర్చాలని లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర శిక్షలోని అన్ని విభాగాలు నిరవధిక సమ్మె చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల జేఏసీ జిల్లా అధ్యక్షులు భూసారపు గంగాధర్, ప్రధాన కార్యదర్శి గాంధారి రత్నం, ఠాకూర్ గజేందర్ సింగ్, కప్పకంటి సుధాకర్, హరీష్, స్పందన్, శ్రీనివాస చారి, వివేక్, లింగన్న, కావ్య, స్నేహ, రాకేష్, రవి, క్రాంతి, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల విద్యార్థులకు
క్రీడా సామగ్రిని అందించిన పూర్వవిద్యార్థులు

బోథ్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దన్నూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థులు 8 వేల రూపాయల విలువైన క్రీడా సామాగ్రిని అందించారు. పాఠశాలలో చదివి ప్రభుత్వ టీచర్లుగా ఉద్యోగాలు సంపాదించిన హైదర్, చంద్రకాంత్‌లతో పాటు ప్రైవేట్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్న లింగన్నలు విద్యార్థుల కోసం క్రీడా సామాగ్రిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజు, పీఈటీ సంగీతలకు అందించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాను చదివిన పాఠశాల విద్యార్థులకు చేయూతనివ్వాలన్న సంకల్పంతో క్రీడా సామాగ్రిని అందించామన్నారు. రానున్న రోజుల్లో విద్యార్థులకు మరిన్ని వసతులను కల్పించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రావుల శంకర్, విద్యార్థులు ఉన్నారు.

వడ్‌గావ్ గిరిజన బాలుర ఆశ్రమ హాస్టల్‌లో వైద్య శిబిరం

ఇంద్రవెల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్‌గాం గ్రామంలోని ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల, హాస్టల్‌లో శుక్రవారం పిట్ట బొంగురం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సిబ్బంది, వైద్యాధికారి డాక్టర్ పూజిత ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. పలువురు విద్యార్థులకు పరీక్షలు చేసి అనారోగ్యంతో బాధపడుతున్న వారికి మందులు పంపిణీ చేశారు. విద్యార్థులకు రక్త నమూనాలు సేకరించారు.

మహిళల సంరక్షణే పోలీసుల ధ్యేయం

- కుటుంబాలను కలిపేందుకే భరోసా కేంద్రం ఏర్పాటు
- నిర్మల్ జిల్లా ఎస్పీ జానకీ షర్మిల



కార్యక్రమంలో పాల్గొన్న నిర్మల్ జిల్లా ఎస్పీ డాక్టర్ జానకీషర్మిల

నిర్మల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మహిళల సంరక్షణే పోలీసుల ధ్యేయమని నిర్మల్ జిల్లా ఎస్పీ డాక్టర్ జానకీషర్మిల అన్నారు. శుక్రవారం నిర్మల్ పట్టణంలో ఏర్పాటు చేసిన భరోసా కేంద్రంలో ఆమె మాట్లాడుతూ.. క్షణికావేశంలో గొడవలు పడ్డ కుటుంబాలను కలిపేందుకే భరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేశామని దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. చిన్న చిన్న సమస్యలతో క్షణికావేశంలో గొడవలు పడి కుటుంబాలకు దూరంగా ఉంటున్న భార్యభర్తలకు కౌన్సిలింగ్‌లు నిర్వహించేందుకు నిష్ణాతులైన ఓ మహిళ ఎస్సై పర్యవేక్షణలో కౌన్సిలింగ్‌ను నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. పర్యవేక్షణ అధికారులు చెప్పిన మాటలు ఓపిగ్గా విని ఒకసారి వినకపోతే మళ్లీ మరలా వారిని ఒప్పించడమే తమ ధ్యేయంగా పని చేస్తున్నారని ఆమె తెలిపారు. ఈ కౌన్సిలింగ్ ద్వారా ఇప్పటి వరకు 52 కుటుంబాలు జీవితాలను నిలబెట్టినట్లు, కలిసిన జంటలు వారి కుటుంబ సభ్యులు ఆనందానికి అవధులు లేవన్నారు. మహిళలకు, పిల్లలకు ఒకేచోట మెడికల్ న్యాయసలహా, వైద్యం కౌన్సెలింగ్ సైకాలజికల్ సమస్యలను అన్ని సౌకర్యాలు ఒకేచోట కల్పిస్తూ రాష్ట్ర పోలీస్ ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో భరోసా సెంటర్ ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. మహిళల భద్రతకు భరోసానిస్తూ బాధిత మహిళలకు పిల్లలను హక్కున చేర్చుకుని కొండత ధైర్యానిస్తూ మహిళా సమస్యలకు తక్షణ పరిష్కారం చూపడమే లక్ష్యంగా భరోసా సెంటర్ సేవలను అందిస్తుందన్నారు. జిల్లాలోని ఏ ప్రాంతమైన సరే తప్పకుండా పోలీసులు ఇంటి వారిలా పరిగణించి ఏ సమస్య వచ్చినా చెప్పుకుంటే తప్పకుండా సమస్య పరిష్కారాన్ని చూపేలా ప్రయత్నం చేస్తుందన్నారు. పోలీసు యంత్రాంగం 100 శాతం పని చేస్తుందన్నారు. దాంపత్య జీవితం అనేది ప్రతీ ఒక్కరి జీవితంలో వెలుగులు పంచేలాగా ఉండాలన్నారు. సమ స్యల వల్ల విడిపోయి దూరంగా ఉండటం ఇరు వురికి ఎంత బాధ కలిగిస్తుందో ప్రతీ ఒక్కరికి తెలుసునని అందుకోసం ఇలాంటి సమస్య తప్ప కుండా సిబ్బందిని గాని జిల్లా ప్రధాన కార్యాల యంలో వచ్చి చెప్పిన తప్పకుండా తోడుగా ఉండి సమస్యలను పరిష్కరించే దిశగా పని చేస్తామని ఆమె హామీ ఇచ్చారు. పోలీసు వారి జీవనశైలి సైతం అందరికీ తెలిసిందేనని, వృత్తి ధర్మానికి న్యాయం చేయాలనే కోణంలో ఆలోచిస్తూ చాలా సందర్భాల్లో తమ సొంత కుటుంబాలకు కూడా సమయం ఇవ్వలేని పరిస్థితి ప్రజల కోసం ఇస్తున్నారన్నారు. భరోసా సెంటర్ ద్వారా వివిధ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఫోక్సో అత్యాచార కేసులలో కౌన్సిలింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. పోలీసుస్టేషన్‌లో కేసు నమోదై మొదలుకొని చివరి వరకు అన్ని తానై వెన్నంటి ఉంటూ బాధిత మహిళలకు అండగా ఉంటుందన్నారు. మహిళలు పిల్లలపై జరిగే నేరాలను, హింసను తగ్గించడమే ఈ కేంద్రం ప్రధాన లక్ష్యమన్నారు. కాబట్టి మహిళలు, యువతులు, బాలికలు అన్యాయానికి గురైనప్పుడు భయపడవద్దని ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. షీటీం సభ్యులు సైతం అందుబాటులో ఉన్నారని, బాలికలు, మహిళలు, విద్యార్థుల భద్రత రక్షణ కొరకు పని చేస్తున్నాయని ఎవరైనా ఆకతాయిలు వేధింపులకు గురిచేసిన, మానసికంగా, శారీరకంగా హింసించిన, సోషల్ మీడియాలో ఫోటోలను మార్చి వేధింపులకు గురి చేసిన వారి వివరాలను షీ టీం పోలీసులకు సమాచారం ఇస్తే ఆకతాయిలను పట్టుకొని మైనర్‌గా ఉంటే కౌన్సిలింగ్ ఇవ్వడం, మేజర్‌గా ఉంటే కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. విద్యార్థులు అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎవరైనా కొత్త వ్యక్తులు చెప్పే మాయమాటలను నమ్మి మోసపోవద్దన్నారు. ఉమెన్స్ సేఫ్టీ అండ్ సెక్యూరిటీ ఫోక్సో చట్టాల గురించి, బాల్య వివాహాల గురించి మానవ అక్రమ రవాణా, బాలల అక్రమ రవాణా, బాలలను అక్రమ దత్తత లాంటివి చేయకూడదన్నారు. ఇలాంటి అక్రమాలకు పాల్పడినట్లు నీ దృష్టికి వస్తే వెంటనే షీ టీం నెంబర్‌కు లేదా 100కి ఫోన్ చేసి సమాచారం అందించాలని అలా సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్స్‌పెక్టర్లు, ఆర్ఐలు, ఎస్సైలు, ఆర్ఎస్సైలు, మహిళా ఎస్సై సుమాంజలి సుమలత, జ్యోతిమని, జిల్లా పోలీస్ అధికారుల కుటుంబ సభ్యులు భరోసా సెంటర్ సిబ్బంది, చీటింగ్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

దైవదర్శనం చేసుకునే స్వేచ్ఛ కూడా మాకు లేదా..?

- పోలీసుల తీరుపై గుండంపల్లి మహిళల ఆగ్రహం



పోలీసుల పహారాలోనే
దుర్గమ్మ దర్శనానికి వెళ్తున్న గుండంపల్లి మహిళలు

దిలావర్‌పూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : దైవ దర్శనం చేసుకునే స్వేచ్ఛ కూడా మాకు లేదా.. ఇథనాల్ పరిశ్రమ ప్రారంభం కాకముందే పరిస్థితి ఇలా ఉంటే పరిశ్రమ ప్రారంభమయ్యాక మా పరిస్థితి ఎలా ఉంటుందోనని భయమేస్తుందని గుండంపల్లి గ్రామ మహిళలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళ్తే కార్తీక శుక్రవారం కావడంతో గ్రామానికి చెందిన కొంత మంది మహిళలు గుండంపల్లి శివారులో ఉన్న దుర్గాదేవిని దర్శించుకుని పూజలు చేసేందుకు పాదయాత్రగా బయలుదేరడానికి సిద్ధమవుతుండగా అమ్మవారి దేవాలయానికి వెళ్లే రహదారిపై పోలీస్ బలగాలు మొహరించాయి. దీంతో గ్రామస్థులు ఒకింత ఆందోళనకు గురయ్యారు. ఏంటి ఇది... మాకు దైవ దర్శనం చేసుకునే స్వేచ్ఛ కూడా లేదా అని ప్రశ్నించారు. అటువైపే ఇథనాల్ పరిశ్రమ నిర్మాణ పనులు జరుగుతుండటంతో ముందు జాగ్రత్తగా పోలీసులు మొహరించడం అనివార్యమే అయినప్పటికీ ఈ చర్య గ్రామస్థులకు అసంతృప్తి, ఆగ్రహం తెప్పించింది. గుడికి వెళ్లేందుకు కూడా పోలీసుల అనుమతి కావాలా అటూ ప్రశ్నించారు. ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే ముందు ముందు ఎలా ఉంటుందో ఆలోచించడానికి భయమేస్తుందన్నారు. మా పంట పొలాలకు వెళ్లేందుకు కూడా ఆంక్షలు పెడుతారేమోనన్న సందేహం వ్యక్తం చేశారు. అయినప్పటికీ పోలీసులు మహిళలు దుర్గాదేవికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకునే వరకు వారి వెంటే పహరా కాశారు. పోలీసుల తీరుపై గ్రామస్థుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోందన్నారు.

సమస్యలుంటే ఫోన్ చేయండి

- బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు ముథోల్ ఎమ్మెల్యే



వైస్ ఛాన్సలర్, ఏవో రణధీర్‌తో కలిసి
ట్రిపుల్ ఐటీలో తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే రాంరావు పటేల్

బాసర, నవంబర్, 22: (ఆంధ్రజ్యోతి) : బాసర ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీని శుక్రవారం ముథోల్ ఎమ్మెల్యే రాంరావు పటేల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవలే ట్రిపుల్ ఐటీలో విద్యార్థిని ఆత్మహత్య చేసుకోవడం, ఆ తర్వాత ఉద్రిక్త ఘటనలు చోటుచేసుకున్న నేపథ్యంలో ఎమ్మెల్యే క్యాంపస్‌ను సందర్శించారు. విద్యార్థులను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతిష్ఠాత్మకమైన విద్యాసంస్థలో వరుసగా ఆత్మహత్య ఘటనలు చోటుచేసుకోవడంపై ఆరా తీశారు. ఆత్మహత్యలు చేసుకోవద్దని చిన్న చిన్న సమస్యలకు బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. ఏదైనా సమస్యలుంటే తనకు నేరుగా కాల్ చేయాలని విద్యార్థులకు ఫోన్ నెంబరు ఇచ్చారు. కష్టపడి చదివి అనుకున్న లక్ష్యాలను చేదించాలని తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని చెప్పారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ట్రిపుల్ ఐటీలో సౌకర్యాలు, సమస్యలు, పరిష్కార చర్యల గురించి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ గోవర్ధన్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ట్రిపుల్ ఐటీ అధ్యాపకులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. తన ప్రాధాన్యత అంశాల్లో విద్య ఉందని అందుకే ట్రిపుల్ ఐటీలో సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని ఇప్పటికే అసెంబ్లీ వేదికగా క్యాంపస్‌లో సమస్యలను ప్రస్తావించినట్లు ఎమ్మెల్యే గుర్తు చేశారు. ఎమ్మెల్యే వెంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాజేష్‌బాబు, నాయకులు వెంగల్‌రావు, తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు బాసటగా నిలుస్తాం

భైంసా, నవంబరు 22 : ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులలో చికిత్సలు పొందిన బాధిత కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం అందించి బాసటగా నిలుస్తామని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ పేర్కొన్నారు. శుక్రవారం భైంసాలోని తన క్యాంపు కార్యాలయంలో నియోజక వర్గ పరిధిలోని వివిధ ప్రాంతాల వాసులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. వైద్య సేవల విషయంలో బాధిత కుటుంబాలు ఆర్థికపరమైన సమస్యల బారిన పడకుండా ఉండేందుకు గాను చేయూతనందిస్తామని వివరించారు. సీఎం రిలీఫ్ ఫండ్ విషయంలో బాధిత కుటుంబాలు పూర్తి వివరాలతో తమ క్యాంప్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఇందులో బీజేపీ భైంసా పట్టణ కమిటీ అధ్యక్షుడు ఎనుపోతుల మల్లేశ్వర్, జిల్లా ప్రతినిధులు నర్సాగౌడ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

దేవాలయాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయండి

బోథ్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : బోథ్ నియోజకవర్గ పరిధిలోని పలు దేవాలయాల నిర్మాణానికి అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖకు వినతిపత్రం అందించారు. నియోజకవర్గ వ్యాప్తంగా వివిధ ఆలయాలకు రావాల్సిన పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని కోరడంతో పాటు బోథ్ పట్టణ కేంద్రంలో గల శివ భక్త మార్కండేయ ఆలయానికి టెండర్లు పిలవాలని కోరడం జరిగిందన్నారు. తమ విజ్ఞప్తిని పరిశీలించిన మంత్రి సాధ్యమైనంత త్వరలో నిధులు మంజూరు చేసి ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. అంతేగాక గిరిజన సంస్కృతి సాంప్రదాయాల కోసం ఆయా గ్రామాలలో దేవాలయాల నిర్మాణానికి సైతం మంత్రి నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చిందని పేర్కొన్నారు.

సామాజిక సేవకు ముందుకురావాలి

- డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య

ఆదిలాబాద్అర్బన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : చలికాలాన్ని దృష్టిలో ఉంచుకొని సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో శిశుగృహాకు హిటర్‌తో పాటు పిల్లలకు దుస్తులను పంపిణీ చేయడం హర్షణీయమని డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య అన్నారు. సత్యసాయి బాబా 99వ పుట్టిన రోజును పురస్కరించుకొని సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో సమాజ సేవ కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం శిశుగృహాలోని చిన్నారులకు దుస్తులు, ఇతర వస్తువులను అందించారు. దీనికి డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య ముఖ్య అతిథిగా హాజరై నిర్వాహకులకు వాటిని అందించారు. ఈ సందర్భంగా డీఎల్ఎస్ఏ కార్యదర్శిసౌజన్య మాట్లాడుతూ సామాజిక సేవలోస్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలన్నారు. సత్యసాయి ట్రస్టు ఆధ్వర్యంలో ఇప్పటికే అనేక కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. సత్యసాయి జన్మదినం సందర్భంగా శిశుగృహా పిల్లలకు బట్టలు, చలి కాలం దృష్ట్యా వాటర్ హిటర్‌ను అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవ సమితి సభ్యులు నర్సింహారావు,గంగారాం, విజయ్‌రెడ్డి, అశోక్, వీణా, శిశుగృహా నిర్వాహకులున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు
పంపిణీ చేసిన బోథ్ ఎమ్మెల్యే

నేరడిగొండ, నవంబరు22 (ఆంధ్రజ్యోతి): సీఎంఆర్ఎఫ్ చెక్కులను శుక్రవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని తన నివాసంలో ఇచ్చోడ మండలం దుబార్‌పేట్ గ్రామానికి చెందిన కె.సంధ్యారాణికి రూ.58వేలు, బోథ్ మండలంలోని కన్గుట్ట గ్రామానికి చెందిన ఓస విజయకు రూ.60వేలు, బినారాయణకు రూ.8వేలు, భీంపూర్ మండలంలోని నిపాని గ్రామానికి చెందిన నవీన్ గౌడ్‌కు రూ.12వేలు, విజయకు రూ.60వేలు నేరడిగొండ మండలంలోని కుంటాల గ్రామానికి చెందిన జాదవ్‌జ్యోతికి రూ.50వేల సావర్గావ్ గ్రామా నికి చెందిన స్వరూపకి రూ.75వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులను బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అందజేశారు.

అన్నాబాబుసాటే భవనం
పనుల పరిశీలన

నార్నూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సాహిత్య సామ్రాట్ అన్నాబావుసాటే భవనం జిల్లా కేంద్రంలో నిర్మించిన సందర్భంగా పనులను నార్నూర్ మాజీ సర్పంచ్ బి.గజానంద్‌నాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాహిత్యవేత్త అన్నాబావుసాటే స్మారకార్థం భవనం నిర్మాణం చేపట్టడం సంతోషకర విషయమని అన్నారు. మహనీయుల ఆశయాలను కొనసాగిద్దామని అన్నారు. వారి వెంట జేఏసీ మాజీ చైర్మన్ ఉత్తంరాథోడ్, దళిత రత్న అవార్డు గ్రహిత నర్సింగ్‌మోరే, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ కమిటీ మెంబర్ అనిల్‌మోటేరావ్ తదితరులున్నారు.

ఆహుతులు లేక.. అభాసుపాలు



సమావేశం ప్రారంభంకాక ముందు... ప్రారంభమైన 10 నిమిషాల్లోనే వెళ్లిపోతున్న ఆహుతులు

నూతన ప్రభుత్వం కొలువుదీరిన యేడాదికావస్తుండగా ప్రజాపాలన విజయోత్సవాలను నిర్వహిస్తుంది. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ సంబరాలకు ఆహుతులు ఎవరు హాజరు కాలేదు. వచ్చిన ఆ కొద్ది మంది సైతం ప్రారంభం కాగానే వెళ్లి పోయారు. దీంతో ఖాళీ కుర్చీల్లో కళాకారులు, కార్యాలయాల సిబ్బందిని కూర్చొబెట్టి తూతు మంత్రంగా నిర్వహించారు. కొత్త ప్రభుత్వం చేపట్టిన తొలి సంబరాలు అబాసుపాలు కావడంతో అధికారుల పనితీరు పట్ల సర్వత్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

(ఆంధ్రజ్యోతి ఆదిలాబాద్ స్టాఫ్‌ఫోటోగ్రాఫర్)



ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్యామలదేవి, పాల్గొన్న కలెక్టర్

క్రీడాకారులు పోటీల్లో రాణించాలి

- గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి పార్థసారథి

ఆదిలాబాద్అర్బన్, నవంబరు22 (ఆంధ్రజ్యోతి)జిల్లాలో అథ్లెటిక్స్‌కు మంచి ఆదరణ వచ్చిందని, గతంలో పోటీల నిర్వహణకు తక్కువ మంది వచ్చేవారని కాని ఇప్పుడు పెద్దఎత్తున వచ్చారని గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి పార్థసారథి అన్నారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో సబ్ జూనియర్ అథ్లెటిక్ ఎంపిక పోటీలను నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి పోటీలను ప్రారంభించారు. కాగా అంతకు ముందు చిన్నారులు చేసిన నృత్యాలు ఆకట్టుకోగా వారిని సత్కరించారు. అనంతరం వీజీఎస్ అకాడమి వారు క్రీడా పరికరాలను అందించారు. ఈ సందర్భంగా గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి పార్థసారథి మాట్లాడుతూ జిల్లాలో అథ్లెటిక్స్ క్రీడలు దిన దిన అభివృద్ధి చెందుతున్నాయన్నారు. గతంలో కేవలం పది మంది కూడా రాకపోయే వారని ఇప్పుడు మాత్రం పెద్ద సంఖ్యలో పిల్లలు రావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో అథ్లెటిక్స్ కార్యదర్శి రాజేశ్, పేటా సంఘం కార్యదర్శి ఎస్.స్వామి,ఎస్‌జీఎఫ్ కార్యదర్శి కాంతారావ్, లచ్చిరాం,అఖిలేష్ తదితరులున్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదును
వేగవంతం చేయండి

లక్ష్మణచాంద, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని బీజేపీ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడిసెమ్మె రాజు శుక్రవారం అన్నారు. మండలంలోని చింతల్‌చందా, చామన్‌పెల్లి, లక్ష్మణచాంద గ్రామాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. బీజేపీ కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరికి వివరించాలని, కాంగ్రెస్ ప్రభుత్వం సంవత్సర పరిపాలన కాలంలో రాష్ట్రం పది సంవత్సరాలు వెనక్కి వెళ్లిందన్నారు. ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసగించి గద్దెనెక్కిన రేవంత్ రెడ్డి ఒక్క గ్యారంటీ కూడా అమలు చేయలేకపోవడం సిగ్గుచేటన్నారు. ఈ ప్రభుత్వం వచ్చిన నాటి నుండి రాష్ట్రం అవినీతిమయం అయిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కమల్‌నయన్, జిల్లా నాయకులు అడ్వాల రమేష్, మండల అధ్యక్షులు పొలాస గోవర్ధన్, నాయకులు మంతెన చంద్రమోహన్ రెడ్డి, వినోద్‌రెడ్డి, దశగౌడ్, ఏ. శ్రీనివాస్, రవీందర్ గౌడ్, రాజేశ్వర్ గౌడ్, మల్లేష్, తదితరులున్నారు.

సర్వే వివరాలు అంతర్జాలంలో పొందుపరుస్తున్న అధికారులు

నర్సాపూర్(జి), నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న సమగ్ర కుల రాజకీయ, సామాజిక, ఆర్థిక సర్వేపై మండల అధికారులు గురువారం నుండి సేకరించిన సమాచారాన్ని అధికారులు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సమగ్ర సర్వే సమాచారం అంతర్జాలంలో పొందుపస్తున్నారు. మండలంలో మొత్తం 8,135 ఇళ్లను ఎన్యుమరేటర్లు గుర్తించారు. మండలంలో 13 గ్రామ పంచాయతీలను గాను 54 మంది ఎన్యుమరేటర్ బ్లాకులను ఏర్పాటు చేశారు. 54 మంది ఎన్యుమరేటర్లు, 6 మంది సూపర్‌వైజర్లను నియమించారు. ఒక్కొక్క ఎన్యుమరేటర్‌కు సుమారు 80 నుండి 85 వరకు 75 ప్రశ్నలతో సర్వే చేయించారు. ఈ సర్వేలో కుటుంబానికి సంబంధించిన పూర్తి వివరాలను ఎన్యుమరేటర్లకు తెలిపి అధికారులకు సహకరించాలన్నారు. నేటి వరకు 7,900ల ఇళ్లకు వెళ్లామని, 97 శాతం సర్వే పూర్తి చేసినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. వచ్చే శుక్రవారంలోగా సర్వే పూర్తి చేయాల్సి ఉన్నందున 100 శాతం పూర్తవుతుందని అధికారులు అంటున్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీడీవో పుష్పలత, ఎంపీవో తిరుపతి రెడ్డి, పంచాయతీ కార్యదర్శి నరేష్, తదితరులు పాల్గొన్నారు.

పాక్‌పట్ల పాఠశాలను
సందర్శించిన ఎంఈవో



సోన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాక్‌పట్ల ఉన్నత పాఠశాలను మండల విద్యాధికారి తోడిశెట్టి పరమేశ్వర్ శుక్రవారం సందర్శించారు. మధ్యాహ్న భోజన వంట గది పరిశీలించారు. అనంతరం నేషనల్ అచీవ్మెంట్ సర్వే (ఎన్‌ఏఎస్)పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ పదో తరగతి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం చంద్రశేఖర్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భక్తి

మరో పండరీపురం

● ఏటేటా విఠలేశ్వర జాతరకు పెరుగుతున్న భక్తుల రద్దీ ● ఐకమత్యంతో ఆలయ అభివృద్ధికి గ్రామస్థుల కృషి

కుభీర్, నవంబరు (ఆంధ్రజ్యోతి) 22 : మండల కేంద్రంలో ఉన్న విఠలేశ్వర ఆలయం మండల వాసులకు ఇది మరో పండరి పురంగా విరాజిల్లుతోంది. మండలానికి మూడు పక్కల మహారాష్ట్ర స్టేట్ ఉండడటంతో అక్కడి సంస్కృతి సాంప్రదాయాలు అధికంగా కొనసాగుతాయి. మహారాష్ట్రలో ఉన్న పవిత్ర పుణ్యక్షేత్రమైన పండరీపురంలో కొలువుదీరిన దేవతామూర్తుల ను ఇక్కడ కొలువుదీర్చారు. ప్రతీ కార్తిక మాసం తరువాత వచ్చే 7వ రోజు నుంచి ఆలయంలో తాలసప్తమి వేడుకలు వారం రోజుల పాటు కొనసాగి చివరి రెండు రోజులు జాతర మహాన్నదానంతో వేడుకలు ముగుస్తాయి. ఈ వేడుకలకు వేల మంది భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకుంటారు.

● ఆలయంలో ఉట్టి పడే శిల్ప సంపద

ఆలయంలో రాతి స్తంభాలపై చెక్కిన శిల్పాలు అపురూపంగా ఉన్నాయి. గర్భగుడి పెద్ద పెద్ద రాతి స్థంభాలతో అమర్చిన విధానం చూపరులను ఆశ్చర్య పరుస్తుంది. గుర్భగుడి ముందు భాగంలో నాలుగు స్థంభాలపై చెక్కిన శిల్పాలు, ఆర్య భాషలో చెక్కిన శిలాశాసనం కనిపిస్తుంది.

● ఇది హేమాడ్‌పత్ ఆలయం..

ఈ ఆలయం గర్భగుడి సూర్యాస్తమయం నుంచి సూర్యోదయం లోపు ఒకే రాత్రి నిర్మించబడినది. దీన్ని హెమాడ్‌పత్ ఆలయంగా పిలుస్తారు. గర్భగుడి ముందు ఉన్న ఆలయాలు దశల వారిగా అప్పటి స్థానిక జమీందారు వంశానికి చెందిన దేశ్‌ముఖ్‌లు , గ్రామస్తులు అభివృద్ధి చేశారు. ఈ ఆలయంలో విఠలేశ్వరుడు రుక్మాబాయి దేవతామూర్తుల విగ్రహాలు కొలువుదీరాయి. ఆలయ ప్రాంగణంలో కుడివైపు శని దేవుడు , నవగ్రహ, ఎడమ వైపు కాశీ విశ్వనాథ్ ఆలయం, పక్కనే స్వామి ఆలయం వెనుక భాగంలో వరసిద్ధి వినాయక ఆలయం నాగ దేవత ప్రతిమలున్నాయి.

● ఐకమత్యంతో దినదిన అభివృద్ధి..

గ్రామస్థులు ఐక్యమత్యంతో కృషి చేయడంతో ఆలయం దినదిన అభివృద్ధి చెందుతోంది. ఈ ఆలయంలో రోజు వేకువ జామున అభిషేకం హారతి, ప్రతి ఏకాదశి మరుసటి రోజు వందలాది భక్తులకు అన్నదానం, ఉట్ల పండుగ, కార్తీక మాసంలో నెల రోజులు పాటు వేకువ జామున కాకడ హారతి కార్యక్రమాలు కొనసాగుతాయి. ఉట్ల పండగ రోజు గ్రామంలోని పలు వర్గాల వారు అన్నదానం చేయగా, సప్తమి వేడుకల్లో వారం రోజుల పాటు ఆర్యవైశ్య కులస్థులు అన్నదానం, జాతర ముంగిపు రోజు యాదవ, మున్నూరు కాపు సంఘాలు సుమారు 50 క్వింటాల్ల బియ్యాన్ని వండి మహా అన్నదానం నిర్వహిస్తారు. ఇదే రోజు యాదవ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం ఆనవాయితీగా వస్తుంది.



ఆలయంలో కొలువుదీరిన విఠలరుక్మాయి దేవతామూర్తులు



ఆలయం ముందు ధ్వజ స్థంభం



గర్భగుడి



ఆలయంలో లోపల కాశీవిశ్వనాథ్, నవగ్రహాలు

● అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం..

డా. పెంటాజీ, ఆలయ కమిటీ అధ్యక్షుడు



ప్రతీయేటా అనుభవాలను దృష్టిలో ఉంచుకొని జాతర, అన్నదాన కార్యక్రమానికి వచ్చే భక్తులకు కావాల్సిన ఏర్పాట్లను చేస్తున్నాం. ప్రతీ రోజు ఆలయంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నాము.

● సహకారం అందిస్తున్నాం..

దత్తాద్రి, యాదవ సంఘం అధ్యక్షుడు



జాతరకు వచ్చే భక్తులకు ఆలయ కమిటీ సూచన మేరకు సహాయ సహకారాలు అందిస్తున్నాము. అప్పజెప్పిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తూ తగు ఏర్పాట్లను చేస్తున్నాం. జాతర ముగింపు రోజు నిర్వహించే అన్నదాన కార్యక్రమం కోసం సంఘం వారికి బాధ్యతలను అప్పగించారు.

ఫోకస్



ఓపెన్ ప్లాట్‌లో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు

అధ్వానంగా మారుతున్న ఖాళీస్థలాలు

● భైంసాలో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు ● కాలనీ వాసుల ఇబ్బందులు

భైంసా, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): అందంగా నిర్మించుకున్న భవనాల పక్కనే భారీగా పెరిగిన ముళ్లపొదలు, పిచ్చి మొక్కలు, గుంతలు ఏర్పడి ఆ స్థలాల్లో నీరు నిలిచి పరిస్థితులు అధ్వాన్న స్థితికి చేరుకుంటున్నాయి. ఇలాంటి ప్రాంతాల్లో పందుల స్వైర విహారం అధికంగా ఉంటుండగా దోమల బెడద తీవ్ర రూపం దాల్చుతోంది. సంబంధిత ఖాళీ స్థలాల్లోని ముళ్ల పొదలను తొలగించి ప్రాంతాలను శుభ్రం చేద్దామనుకుంటే ఆ స్థలం యజమాని వచ్చి గొడవ పడతాడేమోననే భయం. వెరసి ఆయా కాలనీవాసులు నిత్యం అవస్థల పాలవుతున్నారు. ఈ పరిస్థితి రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసా పట్టణంలోని పలు వార్డులలో నెలకొని ఉంది. పట్టణ పరిధిలో వేయికి పైగా ఓపెన్ ప్లాట్లు ఉన్నట్లుగా మున్సిపల్ రికార్డులు తెలుపుతున్నాయి. కాగా కొన్ని వార్డుల్లో ఖాళీ స్థలాల్లో ఇళ్లు నిర్మించక పోవడంతో ముళ్ల చెట్లు, పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి స్థానికులకు ఇబ్బందికరంగా మారాయి. దీంతో విష పురుగుల బెడద అధికమైంది. వీటితో పాటు మురుగు నీరు నిలవడంతో దోమలు పెరిగి ఆయా ప్రాంతాలవాసులు వ్యాధులబారిన పడి ఆసుపత్రులు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. పట్టణ పరిధిలోని సాయినగర్ కాలనీగీతా కాలనీ, రాజీవ్‌నగర్, నర్సింహనగర్, వినాయక్‌నగర్, గోకుల్‌నగర్,రాహుల్‌నగర్ ప్రాంతాల్లోని ఖాళీ స్థలాల మూలంగా సంబంధిత కాలనీ వాసులు అన్నీ కాలా ల్లోనూ అవస్థలు పడుతున్నారు.

● వ్యాపారుల ధన దాహంతోనే సమస్యలు

పట్టణ పరిధిలో రియల్టర్లు ఎక్కడ పడితే అక్కడ వెంచ ర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇలాంటి వెంచర్లలో తక్కువ ధర ఉన్నప్పుడు ప్లాట్లు కొని పెట్టుకొని మార్కెట్‌లో వాటికి డిమాండ్ పెరగానే విక్రయిస్తున్నారు. గృహ నిర్మాణాలు జోరుగా కొనసాగుతున్న కాలనీల్లో ప్లాట్లకు డిమాండ్ అధికంగా ఉంటోంది. ఇలాంటి కాలనీల్లో వ్యాపారస్తులు ప్లాట్లు కొనుగోలు చేసి ఇళ్ల నిర్మాణాలు చేపట్టకుండా ఖాళీగా ఉంచుతున్నారు. పక్కన భవన నిర్మాణాలు జోరుగా కొనసాగుతున్నప్పటికి వ్యాపారుల కొనుగోలు చేసిన ప్లాట్లలో నిర్మాణాలు జరుగకపోవడంతో సమస్యలు పెరుగుతున్నాయి. వ్యాపారుల దనదాహం మూలంగా ఆయా కాలనీవాసులకు అగచాట్లు తప్పడం లేదు.

● రాకపోకలకు ఇబ్బందులు

పట్టణ పరిధిలో అంతర్గత రోడ్లు అధికంగా ఇరుకుగా ఉన్నాయి. ఇలాంటి రోడ్లను అనుకొని ఉన్న ఖాళీ ప్లాట్లలో పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలతో రాకపోకలు తీవ్ర ఆటంకాలు కలుగుతున్నాయి. ముళ్లపొదల కొమ్మలు రోడ్లపైకి వస్తుండటంతో ద్విచక్ర వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. ఏపుగా పెరిగిన కొమ్మలు మూలంగా కొన్ని రోడ్ల మూలమలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనం దగ్గరికి వచ్చేంత వరకు ఏర్పడకుండా ఉండని పరిస్థితి నెలకొంది.

● మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలి..

(ఎనుపోతుల మల్లేశ్వర్, అధ్యక్షుడు, బీజేపీ, భైంసా టౌన్)



ఖాళీ స్థలాల మూలంగా ఏర్పడుతున్న సమస్యల పరిష్కారానికి మున్సిపల్ అధికారులు చర్యలు చేప ట్టాలి. ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు తొలగింపచేసేందు గాను చర్యలు తీసుకోవాలి. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడకుండా చూడాలి. పారిశుధ్య సమస్యలు ఉత్పన్నం కాకుండా ప్రణాళిక బద్దంగా వ్యవహరించాలి

● సమస్యల పరిష్కారానికి కృషి

(బి.రాజేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ ,భైంసా)



ఖాళీ స్థలాలు, ఓపెన్ ప్లాట్ల మూలంగా ఎదురవుతున్న అన్ని సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. ఖాళీ స్థలాల్లో ఇళ్లను నిర్మించకుండా వదిలి వేసిన వారికి నోటీసులు జారీ చేస్తాం. ఓపెన్ ప్లాట్లకు ప్రహరీలు నిర్మించు కోవాలని సూచిస్తాం. ఇళ్లు నిర్మించుకొని నివాస ముంటున్న వారికి ఇబ్బందులు కలుగకుండా చూస్తాం

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లపై టోల్ ఫ్రీ నెంబర్

● ఆదిలాబాద్‌లోని ఏజెన్సీ మండలాలకు కొత్త సబ్‌స్టేషన్ల మంజూరు ● నాణ్యమైన కరెంట్ సరఫరాకు విద్యుత్ శాఖ చర్యలు



విద్యుత్ సబ్‌స్టేషన్





విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

ఆదిలాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మారుమూల ఏజెన్సీ మండలాలకు కొత్త సబ్‌స్టేషన్లను మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా గాదిగూడ మండల కేంద్రంలో 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్, ఇంద్రవెల్లి మండలం ధనోర(బి), జిల్లా కేంద్రంలోని కొత్త కలెక్టరేట్ కార్యాలయం, నేరడిగొండ మండలంలోని వాంకిడి గ్రామంలో 33/11కేవీ సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే టెండర్ ప్రక్రియను పూర్తి చేశారు. త్వరలోనే సబ్‌స్టేషన్ల నిర్మాణ పనులను ప్రారంభించనున్నారు. మారుమూల గిరిజన గ్రామాలకు నాణ్యమైన నిరంతర విద్యుత్‌ను సరఫరా చేసేందుకు కొత్త సబ్‌స్టేషన్లు ఎంతగానో ఉపయోగపడుతాయని అధికారులు పేర్కొంటున్నారు. అలాగే సిరికొండ మండల కేంద్రంలో మరో సబ్‌స్టేషన్‌ను ఏర్పాటుచేసేందుకు ప్రభుత్వానికి అధికారులు ప్రతిపాదనలు పంపించారు. త్వరలోనే ఈ సబ్‌స్టేషన్ మంజూరయ్యే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

టోల్‌ఫ్రీ నెంబర్ 1912..

విద్యుత్ వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన సేవలు అందించేందుకు విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నెంబర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇక పై విద్యుత్ సమస్యల పరిష్కారానికి వినియోగదారులు 1912 టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్‌చేసి విద్యుత్ సేవలను పొందవచ్చు. ఇప్పటికే ఏర్పాటు చేసిన అన్ని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల పై టోల్‌ఫ్రీ నెంబర్లను ముద్రించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేస్తే 24గంటల పాటు సేవలను అందించనున్నారు. ఎటువంటి విద్యుత్ సమస్యలు తలెత్తిన టోల్‌ఫ్రీ నెంబర్‌ను సంప్రదించాలని అధికారులు కోరుతున్నారు. కార్పొరేట్ స్థాయిలో టోల్‌ఫ్రీ సేవలు అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగారులు, రైతులు విద్యుత్ టోల్ ఫ్రీ నెంబర్‌ను గుర్తుంచుకోవాలని సూచిస్తున్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మత్తులు, కరెంట్ సరఫరాలో అంతరాయం, కరెంట్ బిల్లుల్లో ఎచ్చుతగ్గులు, ఫ్యూజ్ ఆఫ్‌కాల్స్, విద్యుత్ మీటర్ల మార్పు, అన్ని రకాల కొత్త సర్వీసుల మంజూరు, వినియోగదారుల పేరు మార్పులు, క్యాటగిరి మార్పు, లోడు మార్పు తదితర సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1912కు కాల్ చేయాలని అధికారులు కోరుతున్నారు.

సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ నెంబర్..

● జేఆర్ చౌహాన్ (విద్యుత్‌శాఖ,ఎస్‌ఈ, ఆదిలాబాద్)



విద్యుత్ సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ నెంబర్ 1912 ఎంతో దోహద పడుతుంది. ప్రతీఒక్కరు ఈ నెంబర్‌ను గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉంది. టోల్‌ఫ్రీ నెంబర్‌కు వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి వెంటనే చర్యలు తీసుకుంటాం. దీనిపై ఉన్నత స్థాయి అధికారులు సమీక్షలు నిర్వహించే అవకాశం ఉంటుంది. అలాగే రైతులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా టోల్‌ఫ్రీ నెంబర్ ఉపయోగపడుతుంది. ఇకపై నేరుగా అధికారులకు ఫిర్యాదులు తగ్గుముఖం పడుతాయి.

సమగ్ర సర్వే వేగవంతం

● వ్యక్తిగత సమాచారం గోప్యం

ఆంధ్రజ్యోతి పరిశీలన



బోథ్‌లో సర్వే చేస్తున్న ఉపాధ్యాయులు

బోథ్ రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): బోథ్ మండలం మొత్తం 13,855 కుటుంబాలను సర్వే చేసేందుకు మండల స్థాయి అధికారులు, ఉపాధ్యాయులు బిజీబిజీగా ఉన్నారు. ఇంటింటికి తిరుగుతూ సర్వే చేపడుతుండగా కొంత మంది సర్వేలో సరైన సమాచారం ఇవ్వడం లేదు. ముఖ్యంగా వ్యక్తిగత సమాచారాన్ని అందించేందుకు ఇంటి యజమానులు ఇష్టపడటం లేదని సర్వే అధికారుల ద్వారా తెలిసింది. అయితే కొంత తమంది అసలు సమాచారం ఇవ్వడానికి ముందుకు రావడం లేదని సర్వే అధికారులకు ఇచ్చిన సమాచారం వల్ల భవిష్యత్తులో మంచి జరగుతుందో చెడు జరుగుతుందోనని శంషయిస్తున్నారు. మరో వైపు సర్వే బృందాల వారు కాలనీకి వెళి తే కొంత మంది ఇళ్లకు తాళాలు వేసి సర్వే సిబ్బందికి కనిపించకుండా పోతున్నారు. దీంతో సర్వేకు కొంత ఆటంకం కలుగుతుంది.

● వ్యక్తిగతం వారి ఇష్టం..

సమగ్ర సర్వేలో ఆయా ఇంటి వారి వ్యక్తిగత విషయాలను అడగడంతో ఇంటి యజమానులు సరైన సమాచారం ఇవ్వడం లేదని సర్వే చేస్తున్న ఉద్యోగులు అంటున్నారు. బ్యాంకులో ఉన్న అప్పులు చెబుతున్నారు తప్ప వారికి ఉన్న ఆస్తుల వివరాలు తెలపడం లేదని పేర్కొంటున్నారు. ఇంట్లో కళ్లెదుటే సామాగ్రి కనిపిస్తున్న వారు చెప్పింది రాసుకుంటున్నామన్నారు. వ్యక్తిగత సమాచారాన్ని వారు చెప్పిందే రాయాలని పై స్థాయి నుంచి ఆదేశాలు ఉండటంతో తాము ఎవరికి బలవంతం పెట్టడం లేదని సిబ్బంది అంటున్నారు.

● సర్వేకు మరో ఛాన్స్..

సమగ్ర సర్వే సందర్భంగా కొంత మంది స్థానికంగా ఉండటం లేదని అయితే వారందరి పేర్లను నమోదు చేసేందుకు గాను తమ సిబ్బంది మరోసారి వారి ఇళ్లకు వెళ్లి వస్తారని ఎంపీడీవో రమేష్ తెలిపారు. మరో వెయ్యి కుటుంబాలు పెరిగే ఆస్కారం ఉందని, వారికి సంబంధించిన వివరాలు సేకరిస్తామన్నారు. సర్వేకు ప్రతీఒక్కరు సహకరించాలని, ఇది భవిష్యత్తులో ఉపయోగపడే ఆస్కారం ఉందని ఎంపీడీవో తెలిపారు. సేకరించిన సమాచారాన్ని కంప్యూటీకరణ చేయనున్నామన్నారు.

కనువిందు చేస్తున్న కృష్ణ జింకలు

ఆదిలాబాద్ రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రానికి కూత వేటు దూరంలో ఉన్న దుర్గానగర్ అడవిలో కృష్ణ జింకల సంచారం కనువిందు చేస్తున్నది. బీహార్ లాంటి రాష్ట్ర అడవుల్లో కనిపించే కృష్ణ జింకలు కొన్నాళ్ల క్రితం జిల్లా అడవులకు వలస వచ్చినట్లు తెలుస్తున్నది. ఈ దృశ్యాలను వైల్డ్ లైఫ్ ఫొటో గ్రాఫర్ లింగంపల్లి కృష్ణ తన కెమెరాలో చిత్రీకరించారు. కొన్నేళ్ల కాలంలో దుర్గానగర్ అడవి క్రమంగా అభివృద్ధి చెందుతూ వస్తున్నది.. పచ్చదనం, పక్షులు జంతువులతో అలరారుతున్న ఈ అడవి పర్యాటక ప్రాంతంగా గుర్తిస్తే మరింత ప్రయోజనకరంగా ఉంటుంది. కాగా కుక్కలు, వేటగాళ్ల నుంచి ఈ అరుదైన కృష్ణ జింకలను సంరక్షించాల్సిన బాధ్యత అటవీ శాఖాధికారులపై ఉన్నది.



దుర్గానగర్ అడవిలో కృష్ణ జింకలు



దత్తత

- బాసర ట్రిపుల్ ఐటీకి ఎస్పీ జానకీ షర్మిల బాసట
- విద్యార్థుల్లో మనోధైర్యంతో పాటు మానసిక ఉల్లాసానికి కృషి
- ప్రయోగాత్మకంగా రూపొందిన పోలీసు కార్యాచరణ
- ఇక సంస్కరణ బాటలో ట్రిపుల్ ఐటీ ప్రాంగణం
- కౌన్సెలర్ విధానంపై ప్రత్యేక దృష్టి

నిర్మల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : బాసర ట్రిపుల్ ఐటీని సంస్కరించేందుకు పోలీసుమార్క్ కార్యాచరణ రూపొందింది. ఈ మేరకు జిల్లా ఎస్పీ జానకీషర్మిల బాసర ట్రిపుల్ ఐటీపై ప్రత్యేకదృష్టి సారించి అక్కడి విద్యార్థుల్లో మానసిక స్థైర్యాన్ని నింపేందుకే కాకుండా వారిలో నెలకొంటున్న ఆత్మన్యూనత భావాన్ని తొలగించేందు కోసం ఎస్పీ వినూత్న ఆలోచనకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా జాతీయ దత్తత దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం నుంచి బాసర ట్రిపుల్ ఐటీని ఎస్పీ స్వయంగా దత్తత తీసుకోబోతుండడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. ట్రిపుల్ ఐటీ దత్తత కోసం ఎస్పీ ఇప్పటికే పలుసార్లు క్యాంపస్‌ను సందర్శించి అక్కడి పరిస్థితులను స్వయంగా తెలుసుకున్నారు. అలాగే విద్యార్థులతో కలిసి మాట్లాడడమే కాకుండా వారితో కలిసి భోజనం చేయడం అలాగే వారితో ముఖాముఖిగా చర్చించడం లాంటి కార్యాచరణను అమలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ విద్యార్థుల్లోని అంతరంగాన్ని తెలుసుకొని దానికి అనుగుణంగా దత్తత కార్యక్రమానికి రూపకల్పన చేశారు. ఆత్మహత్యలు లేని ట్రిపుల్ ఐటీగా తీర్చిదిద్దడమే కాకుండా మన ఆర్‌జెయూకేటీ మన బాధ్యత అనే నినాదాన్ని రూపొందించారు. ఇందులో భాగంగానే చిట్ చాట్ ఇన్ ఏ వాక్ అనే పేరిట సామాజిక మాధ్యమాల ద్వారా విద్యార్థుల్లో చైతన్యం నింపడం వారిని మానసికంగా బలపడేట్లు చేయడం లాంటి వాటిని చేపట్టనున్నారు. ఇందులో భాగంగానే ఎస్పీ మొత్తం పదకొండు విధి విధానాలను రూపొందించారు. దీనికి అనుగుణంగా ఒక్కో విధానంలో పూర్తిగా విద్యార్థులను భాగస్వాములను చేస్తూ వారిని మానసికంగా, నైతికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా పెట్టుకుంటున్నారు. ఎస్పీ దత్తత తీసుకోవడంతో ట్రిపుల్ ఐటీలో సమూలమైన మార్పులు చేకూరవచ్చని భావిస్తున్నారు.


విద్యార్థులతో భోజనం చేస్తున్న ఎస్పీ డాక్టర్ జానకీషర్మిల

చిట్ చాట్ ఇన్ ఏ వాక్

చిట్ చాట్ ఇన్ ఏ వాక్ పేరిట ఎస్పీ జానకి షర్మిల రూపొందించిన కార్యాచరణ శనివారం నుంచి ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో అమలు కాబోతోంది. మొదట బడి దత్తత తీసుకోవడం పేరిట ప్రతీ సీనియర్ విద్యార్థి చేత ప్రతీ సంవత్సరం ఒక జూనియర్ విద్యార్థిని దత్తత తీసుకోనున్నారు. ఇలా సీనియర్ జూనియర్‌ల మధ్య స్నేహపూర్వ బంధం ఏర్పడడమే కాకుండా ఒకరి నుంచి మరొకరు తమ అనుభవాలను మెరుగు పర్చుకునే అవకాశం ఏర్పడనుందంటున్నారు. అలాగే గోదావరి క్లీనింగ్ పేరిట క్యాంపస్‌లో ప్లాస్టిక్ వాడకం, దాని ద్వారా జరిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించనున్నారు. దీంతో పాటు పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించి పోటీ ప్రపంచంలో ఉన్నత స్థానాలకు చేరుకున్న వారితో చర్చలు నిర్వహించనున్నారు. అలాగే సెమిస్టర్ పరీక్షకు వార్షిక విధానాన్ని అమలు చేయనున్నారు. టీయూసీ వార్షిక పరీక్షల నుంచి సెమిస్టర్ మోడ్ పరీక్షల పునరావాసం చేపట్టనున్నారు. మార్ట్‌లో కేకుల పేరిట పప్స్ అండ్ ఫ్రూట్ జ్యూస్‌లతో బర్త్‌డే పార్టీలను సెలబ్రేట్ చేసుకునే అవకాశం లేదు. దీని కారణంగా రెండు సంవత్సరాల నుంచి విద్యార్థుల బర్త్‌డే సెలబ్రేషన్‌లు జరుపుకోవడం లేదు. దీనిపై కూడా పునరాలోచన చేయాలని భావిస్తున్నారు.

ఏకో పార్క్ సందర్శన

ఏకో పార్క్ అనేది ఒక కృత్రిమ ఉద్యానవనం. ఇక్కడ విద్యార్థులకు ప్రవేశం లేదు. అయితే ఇక నుంచి టీయూసీ విద్యార్థులకు ప్రవేశం కల్పించడమే కాకుండా ఆ ఏకో పార్క్ పర్యవేక్షణ ఇస్తూ వినోదాన్ని పంచాలని నిర్ణయించారు. ట్రెండింగ్ సెలబ్రేటీలు లేదా యూ ట్యూబర్‌లను క్యాంపస్‌కు ఆహ్వానించి వారి చేత ప్రత్యేకంగా సెషన్‌లు, సెమినార్‌లు నిర్వహించి విద్యార్థుల అంతర్గత ఆలోచనలు, వారి జీవితాల్లో లభించే అవకాశాలు, మార్పులపై అవగాహన పెంపొందించనున్నారు. టీయూసీ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా క్రీడా పోటీలను ఏర్పాటు చేయడమే కాకుండా తక్షణంగా క్రికెట్ మ్యాచ్ నిర్వహించనున్నారు. అలాగే ఎస్పీ క్యాంపస్‌లో ప్రతివారం ఏదైనా ఒక ప్రత్యేక కార్యాచరణను అమలు చేయనున్నారు.

తెరపైకి కౌన్సెలర్ విధానం

కాగా ఇప్పటి వరకు విద్యార్థులు కౌన్సెలర్‌ల వద్దకే వెళ్లి వారి ద్వారా కౌన్సెలింగ్‌లు పొందేవారు. అయితే ఇక నుంచి కౌన్సెలర్‌లే విద్యార్థుల వద్దకు వెళ్లి వారితో చర్చలు జరపడమే కాకుండా అన్యోన్యంగా వ్యవహరించనున్నారు. కౌన్సెలింగ్ విధానంతో విద్యార్థుల్లో మానసిక ధైర్యాన్ని పెంచే విధంగా చర్యలు చేపట్టనున్నారు. ముఖ్యంగా టీయూసీ విద్యార్థులపై ఎక్కువగా ఎస్పీ తన దత్తత కార్యక్రమంలో ఫోకస్ చేయబోతున్నారు. ఇటీవల జరిగిన సంఘటనలు ఎక్కువగా పీయూసీ విద్యార్థులకే చెందినవి కావడంతో ఎస్పీ వారిపైనే దృష్టి పెడుతున్నారు. దత్తత కార్యక్రమంలో కూడా వారికే ప్రాధాన్యతను కల్పించనున్నారు. దీంతో పాటు ఓపెన్ టాక్ పేరిట కూడా సీనియర్‌లు జూనియర్‌ల మధ్య నిరంతర సెషన్స్ నిర్వహించడం, ఒకరికొకరు అభిప్రాయాలను వ్యక్తీకరించుకోవడం, శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధి లాంటి అంశాలపై చర్చించడం, ఒత్తిడిని జయించే అంశాలపై మాట్లాడుకోవడం లాంటివి నిర్వహించనున్నారు.

స్నానఘట్టాల్లో భారీగా భక్తుల రద్దీ


గోదావరిలో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

బాసర, నవంబరు 22 : (ఆంధ్రజ్యోతి) : బాసర గోదావరి నదీ తీరం భక్తులతో శుక్రవారం కిటకిటలాడింది. కార్తీకమాసం పురస్కరించుకొని అధికసంఖ్యలో భక్తులు వచ్చారు. కార్తీకమాసం చివరి రోజులు కావడంతో భక్తుల రద్దీ పెరిగింది. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు గోదావరిలో కార్తీకస్నానాలు ఆచరించడానికి వచ్చిన భక్తులతో సందడిగా కనిపించింది. అన్ని ఘాట్‌లు భక్తులతో నిండిపోయాయి. గోదావరి స్నానాల అనంతరం భక్తులు సరస్వతీ అమ్మవారిని దర్శించుకున్నారు.

కార్తీక దీపాలంకరణ

కార్తీక మాసాన్ని పురస్కరించుకొని బాసర సరస్వతీ దేవస్థానం ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం రాత్రి అమ్మవారి ఆలయంలో కార్తీక దీపాలంకరణ కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆకట్టుకునే ఆకృతుల్లో కార్తీక దీపాలను వెలిగించారు.


అమ్మవారి ఆలయంలో కార్తీక దీపాలను వెలిగిస్తున్న భక్తులు

దత్తసాయి ఆలయంలో కాలభైరవ జయంతి


అభిషేకం చేస్తున్న భక్తులు

నిర్మల్ కల్చరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : గండి రామన్న దత్తసాయి ఆలయంలో కొలువైన కాలభైరవ స్వామి జయంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సాయిదీక్షసమితి అధ్యక్షుడు లక్కడి జగన్మోహన్‌రెడ్డి కాలభైరవస్వామికి పంచామృత అభిషేకం నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు. నందు, శివ, సాయిరాం, ఆలయ పూజా రులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రారంభమైన సప్తాహ వేడుకలు

కుభీర్, నవంబరు(ఆంధ్రజ్యోతి) 22 : మండల కేంద్రంలోని శ్రీ విఠలేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం సప్తాహ వేడుకలు ఘనంగా ప్రారంభమైయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం ఆలయంలో విఠల రుక్మిణీ దేవతామూర్తులకు నూతన వస్త్రాలను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో సప్తాహ వేడుకలను ప్రారంభించారు. ప్రతీ ఏటా కార్తీకమాసంలో ఈ వేడుకలు ఏడు రోజుల పాటు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. సప్తాహ ముగింపు రోజు జాతర, అన్నదాన కార్యక్రమాలు జరుగుతాయి. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు డా. పెంటాజీ, నాయకులు పుప్పాల పీరాజీ పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీని దత్తత తీసుకోవడం సంతోషం

- వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ గోవర్ధన్


కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఎస్పీ జానకీషర్మిల, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ గోవర్ధన్

బాసర, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : బాసర ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌ను నిర్మల్ జిల్లా ఎస్పీ జానకీషర్మిల దత్తత తీసుకోవడం సంతోషకర విషయమని వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ గోవర్ధన్ అన్నారు. శుక్రవారం సాయంత్రం యూనివర్సిటీ యాక్టివిటి సెంటర్‌లో జరిగిన కార్యక్రమానికి జిల్లా ఎస్పీ జానకీషర్మిల ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. యూనివర్సిటీని దత్తత తీసుకోవడం ఉదారమైన స్వభావానికి ధన్యవాదాలని అన్నారు. వారితో కలిసి యూనివర్సిటీని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని అన్నారు. ఎస్పీ జానకీషర్మిల మాట్లాడుతూ క్యాంపస్ సమగ్ర రక్షణ కోసం సంపూర్ణ సహాయం అందిస్తామని అన్నారు. ఆర్జీయూకేటీని అభివృద్ధి పథంలో నడిపించేందుకు తనవంతు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ అవినాష్ కుమార్, ఏవో రణధీర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరె మరాఠాల అభ్యున్నతికి కృషి : విఠల్‌రెడ్డి


సంఘ ప్రతినిధులకు మంజూరుపత్రాన్ని అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే

భైంసా, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రణాళికబద్ధమైన విధానాల ద్వారా ఆరె మరాఠాల అభ్యున్నతికి అంకితభావంతో తోడ్పాటునిస్తానని ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పేర్కొన్నారు. డివిజన్ కేంద్రమైన భైంసాలో ఆరె మరాఠా సంఘ భవన నిర్మాణానికి ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.5 లక్షల మంజూరి పత్రాన్ని శుక్రవారం దేగాం గ్రామంలో సంఘ ప్రతినిదులకు అందచేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారధ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కుల సంఘాల భవనాల నిర్మాణానికి, సభ్యుల సంక్షేమానికి బాధ్యతాయుత విధానాలతో కృషి చేస్తోందన్నారు. ఇందులో భాగంగానే భైంసాలో ఆరె మరాఠాలు నిర్మిస్తున్న సంఘ భవనానికి రూ.5 లక్షలను మంజూరు చేసిందన్నారు. జిల్లా ఇంచార్జి మంత్రివర్యులు సీతక్క ప్రత్యేక దృష్టి సారించి సంఘ భవన నిర్మాణానికి నిధులు మంజూరయ్యేలా చర్యలు చేపట్టిందని వివరించారు. ఆరె మరాఠా భైంసా కార్యవర్గ ప్రతినిధులు రఘువీర్ పాటిల్, జాదవ్ పుండలీక్‌రావ్ పాటిల్, దత్తురామ్ పాటిల్, సభ్యులు సునీల్ పాటిల్, సుమీత్ పాటిల్, గణేష్ పాటిల్, సిద్దేశ్వర్ పాటిల్, చంద్రకాంత్ పాటిల్, గణేష్ పాటిల్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులను బలోపేతం చేద్దాం



నిర్మల్ అర్బన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలను మరింత బలోపేతం చేసేందుకు టీచర్లంతా సమిష్టిగా కృషి చేయాలని అర్బన్ ఎంఈవో నాగేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక జుమ్మేరాత్‌పేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నాగేశ్వరరావు అలాగే ఇటీవల బదిలీపై వెళ్లిన సిబ్బంది ప్రసన్న, నజియాలను సన్మానించారు. అనంతరం ఎంఈవో మాట్లాడుతూ... పేద విద్యార్థుల తల్లిదండ్రుల ఆశలను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ప్రస్తుత ప్రభుత్వ పాఠశాలలు ధీటుగా విద్యాబోధన అందిస్తున్నాయన్నారు. ప్రభుత్వ బడుల్లో పిల్లల నమోదు హాజరుశాతం పెంచేందుకు అందరూ బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ అల్లం రవిబాబు, బొంగురాల మనోహర్, మల్లేశం, శ్రీనివాస్, దత్తురాం, శ్రీమంత్ అర్జున్, ఎల్. సుదర్శన్, శ్రీనివాస్‌రెడ్డి, దయానంద్, ఇర్ఫాన్‌షేక్, కమార్, రాజన్న, వసంతరావు, వినోద్, రమణ, మంజుల, నాగలత, శృతి, శ్వేత, సావిత్రి, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను ఉపయోగించుకొని విజ్ఞానవంతులు కావాలి

లపై వారానికి కొందరు ... ● కలెక్టర్ అభిలాష అభినవ్ ... శిక్షణ కార్యక్రమాలను


గ్రంథాలయంలో పుస్తకాలను పరిశీలిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయాలను ఉపయోగించుకొని విజ్ఞానవంతులు కావాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని జిల్లా గ్రంథాలయాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా గ్రంథాలయంలో వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకుఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థుల కోసం అన్ని రకాల పుస్తకాలను సరిపడినన్ని అందుబాటులో ఉంచాలన్నారు. గ్రంథాలయంలో కుర్చీల కొరత రాకుండా చూడాలన్నారు. అనంతరం పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులతో మాట్లాడుతూ... వారికి గల అవసరాలను అడిగి తెలుసుకున్నారు. సమయపాలనను పాటిస్తూ శ్రద్ధగా చదివి అనుకున్న లక్ష్యాలను సాధించాలని సూచించారు. గ్రంథాలయంలో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ సయ్యద్ అర్జుమన్ అలీ, తహసీల్దార్ రాజు, అధికారులు మోహన్ సింగ్, విజయశ్రీ, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

పట్టణ ప్రాంతాల్లో వంద పన్నుల వసూలు పూర్తి చేయాలి

పట్టణ ప్రాంతాల్లో వంద పన్నుల వసూలు పూర్తి చేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మున్సిపల్‌శాఖ పరిధిలోని పలు అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... అన్ని రకాల పన్నుల వసూళ్లను వంద శాతం పూర్తి చేయాలన్నారు. నిర్ణీత సమయానికి పన్నులు చెల్లించని వారికి నోటీసులు జారీ చేసి, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. ఎల్ఆర్ఎస్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సంబంధిత అధికారులంతా క్షేత్రస్థాయిలో పర్యటించి ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిశీలించి పూర్తి చేయాలన్నారు. ప్రతీ వ్యాపారస్తుడు సంబంధిత లైసెన్స్‌లను పొందే విధంగా అవగాహన కల్పించాలన్నారు. పట్టణ పరిధిలోని ప్రభుత్వ భూములను అన్యాక్రాంతం కాకుండా రక్షించాలని తెలిపారు. ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటికే ప్రభుత్వ భూములను ఆక్రమించినట్లు సమాచారం అందితే వెంటనే ఆక్రమణలు తొలగించి భూములను రక్షించాలన్నారు. మెప్మాశాఖ వారి పరిధిలోని అన్ని పనులను వెంటవెంటనే పూర్తి చేయాలన్నారు. నర్సరీలలో మొక్కలను పెంచేందుకై విత్తన టెండర్లకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో నిర్మల్, ఖానాపూర్, భైంసా మున్సిపల్ కమిషనర్లు ఖమర్ అహ్మద్, మనోహర్, రాజేష్ కుమార్, మెప్మా పీడీ సుభాష్, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణుల మరణాలను తగ్గించేందుకు పటిష్ట చర్యలు చేపట్టాలి

గర్భిణుల మరణాలను తగ్గించేందుకు పటిష్టచర్యలు చేపట్టాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో గర్భస్థ మరణాలపై వైద్య శాఖ అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో గర్భస్థ మహిళల మరణాలను నియంత్రించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. ఇప్పటికే కలెక్టర్ ఆధ్వర్యంలో హై పవర్ కమిటీనీ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లా ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో ఏఎన్ఎం, ఆశా, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులకు హైరిస్క్ గర్భిణీల గుర్తింపు, గర్భస్థ మరణాల నియంత్రణకు చేపట్టవలసిన చర్య నిర్వహించనున్నట్లు తెలిపారు. హైరిస్క్ గర్భస్థ మహిళలకు ఎదురయ్యే సమస్యల పరిష్కారం కోసం జిల్లాలో హెల్ప్ లైన్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ హెల్ప్‌లైన్ కేంద్రాల ద్వారా నలుగురు ఏఎన్ఎం, సిబ్బంది గుర్తించిన హైరిస్క్ గర్భిణీ మహిళలకు ఒక్కొక్కరిగా ఫోన్లు చేసి, వారి ఆరోగ్య స్థితిగతుల వివరాలను తెలుసుకొని, వారికి అవసరమైన వైద్య సేవల వివరాలను తెలియజేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే హైరిస్క్ గర్భిణులకు సంబంధించిన వివరాలు, వారీగా స్థితిగతులకు సంబంధించి సమాచారాన్ని తెలుసుకోవడానికి నెలవారీగా సమీక్ష సమావేశాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎప్పటికప్పుడు హైరిస్క్ గర్భిణుల ఆరోగ్య వివరాలను తెలుసుకుంటూ, మెరుగైన వైద్య సేవలను సూచిస్తూ గర్భస్థ మరణాలను నియంత్రించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గర్భిణీలలో హృదయ సంబంధ సమస్యలు గుర్తించినట్లయితే ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో టూడీ ఎకో వైద్య నిర్ధారణ పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి సంబంధిత వైద్యాన్ని అందించనున్నట్లు తెలిపారు. గర్భం దాల్చిన వెంటనే మహిళలందరూ అవసరమైన మేరకు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. వైద్యుల సూచనల మేరకు వివిధ రక్త పరీక్షలను చేసుకొని మందులను వాడాలన్నారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌వో డా.రాజేందర్, వైద్యులు సురేష్, శ్రీనివాస్, సౌమ్య, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

సోన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ గ్రామీణ మండలం వెంగ్వాపేట్ గ్రామంలో పీఏసీఎస్ మంజులాపూర్ సొసైటీ ఆధ్వర్యంలో నెలకొల్పిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ అభిలాష అభినవ్ శుక్రవారం పరిశీలించారు. రైతుల నుంచి ఇప్పటి వరకు సేకరించిన ధాన్యం నిల్వ గురించి కేంద్రాల నిర్వాహకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతుల సౌకర్యార్థం కేంద్రంలో అందుబాటులో ఉంచిన సదుపాయాలను పరిశీలించారు. కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చిన రైతులను పలకరించి, కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ఆరా తీశారు. రైతులకు కేంద్రాల్లో అన్ని సదుపాయాలను అందుబాటులో ఉంచాలని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తిస్థాయి లక్ష్యానికి అనుగుణంగా సాఫీగా సాగేలా కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. రైతులు ధాన్యం తెచ్చిన వెంటనే తూకం వేయించి, లారీలలో లోడ్ చేసి నిర్దేశిత రైస్ మిల్లులకు పంపించాలన్నారు. మిల్లుల వద్ద ధాన్యం అన్ లోడింగ్ వెంటదివెంట జరిగేలా పర్యవేక్షణ జరపాలన్నారు.

ట్రిపుల్ ఐటీలో నూతన ఆవిష్కరణ

- కొత్త గో-కార్ట్ కనుగొన్న విద్యార్థులు


గో-కార్ట్‌తో విద్యార్థులు

బాసర, నవంబర్, 22 : (ఆంధ్రజ్యోతి) : బాసర ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీ విద్యార్థులు నూతన ఆవిష్కరణ కనుగొన్నారు. కొత్త గో-కార్ట్ (రేసు వాహనం) రూపొందించారు. వచ్చే ఫిబ్రవరి నెలలో కొయంబత్తూర్‌లో జరిగే జాతీయ స్థాయి గో-కార్ట్ ఈవెంట్‌లో ప్రదర్శించనున్నారు. తక్కువ బరువు, పరిమాణం, సామర్థ్యం, పనిచేసే విధానంలో మెరుగుదల కోసం ఈ పోటీలు నిర్వహిస్తారు. ఐఐటీ, ఐఐఐటీ, నీట్, వంటి ప్రతిష్టాత్మక విద్యా సంస్థల నుండి వచ్చిన ఆవిష్కరణలతో బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థుల ప్రాజెక్టు కూడా పోటీ పడనుంది. ఈ ప్రాజెక్టుకు టీం గరుడ అని పేరు పెట్టారు.కొత్త ఆవిష్కరణకు రూ. 4.5 లక్షలు ఖర్చు చేశామని, అనుకున్నట్లు వచ్చిందని తప్పకుండా ఈ సారి ప్రథమ స్థానం సాధిస్తామని బృందంలో ఒకరైన లోకేష్ అనే విద్యార్థి ధీమా వ్యక్తం చేశారు. అయితే గతేడాది బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థుల ప్రాజెక్టుకు ఆరవ స్థానం లభించింది.


సంక్షిప్త సమాచారం

ప్రతీ మహిళ ఒక వ్యాపారవేత్తగా ఎదగాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో రాధారాథోడ్

లక్ష్మణచాంద, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రతి మహిళ ఒక వ్యాపారవేత్తగా ఎదగాలని ఎంపీడీవో రాధారాథోడ్ శుక్రవారం అన్నారు. మండల కేంద్రంలో ఈడీ ఐఐ, యాక్సెంచర్ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఈడీ ఐఐ వారు ఇస్తున్నటువంటి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకొని ప్రతి మహిళ వ్యాపారవేత్తగా ఎదగాలని ఆకాంక్షించారు. ప్రతి వ్యక్తి ఏదో ఒక నైపుణ్యం కలిగి ఉండడం చాలా అవసరమన్నారు. ప్రస్తుత కాలంలో మహిళలు అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారని అభిప్రాయపడ్డారు. ఈ ట్రైనింగ్ 26 రోజులు నిర్వహించబడుతుందని ప్రతి ఒక్కరూ శ్రద్ధగా శిక్షణను తీసుకొని కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ మహేశ్వర్ రెడ్డి, డీఆర్ డీఏ ఏపీఎం వాణిశ్రీ, ఫీల్డ్ ఆఫీసర్ సంతోష్, మాస్టర్ ట్రైనర్ అలేఖ్య, రవి, దేవేందర్, మహిళలు పాల్గొన్నారు.

డీఈవోకు అందజేసిన మొక్కను నాటిన పాక్‌పట్ల పాఠశాల


మొక్కను నాటుతున్న దృశ్యం

సోన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల నిర్మల్ జిల్లా విద్యాధికారిగా బాధ్యతలు చేపట్టిన పి. రామారావుకు తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీయూటీఎఫ్) జిల్లా శాఖ పూల మొక్కను అందజేసి అభినందనలు తెలియజేశారు. మొక్కను ఏదేని ఒక పాఠశాలలో నాటమని డీఈవో కోరగా సోన్ మండలం పాక్‌పట్ల ఉన్నత పాఠశాలలో మండల విద్యాధికారి తోడిశెట్టి పరమేశ్వర్, ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు ఎం. చంద్రశేఖర్ రావు, టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు తోడిశెట్టి రవికాంత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి మొక్కను నాటడం జరిగింది.

కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం



తానూర్, నవంబరు (ఆంధ్రజ్యోతి) 22 : మండలంలోని బోరిగాం జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో శుక్రవారం కంప్యూటర్ ల్యాబ్‌ను ఏఎపీసీ చైర్మన్ సంగీత, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శంకర్‌లు ప్రారంభించారు. విద్యార్థులకు అధునిక యుగంలో కంప్యూటర్ విద్య అత్యవసరము అయినందున, విద్యార్థులకు కంప్యూటర్ ల్యాబ్ ద్వారా తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులున్నారు.